## క్లుప్తంగా

### వాటర్ బాటిళ్ల వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మోతె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కామారెడ్డికి చెందిన దేవి ఆస్పత్రి సౌజన్యంతో వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. పాఠశాలలో చదువుతున్న 130 మంది విద్యార్థులకు రూ. 14,300 విలువ గల స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. దేవి ఆస్పత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిక



కామారెడ్డి టౌన్: బీజేపీ సీనియర్ నేత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జూలూరి సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అభివృద్ధి పథంలోకి వెళ్తున్నందున పార్టీలో చేరినట్లు సుధాకర్ తెలిపారు. నాయకులు గడ్డం చంద్రశేఖర్, కుర్మ సురేందర్, ప్రవీణ్ తదితరులున్నారు.

### ఉత్తమ సేవా పతకానికి ఎంపికైన ఏఎస్సైకి సన్మానం



పెద్దకొడప్గల్(జుక్కల్): తెలంగాణ ప్రభుత్వం అందించే ఉత్తమ సేవా పతకానికి ఏఎస్సై రాములు ఎంపికైనట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై రాములుకు ఎస్ఎస్‌యూవీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పోలీస్ సిబ్బంది సాయి, శివ, ఎస్ఎస్‌యూవీ సభ్యులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు శుభాకాంక్షలు



భిక్కనూరు: జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్‌లు మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

### అదనపు కలెక్టర్‌కు..



కామారెడ్డి రూరల్: కామారెడ్డి కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సివిల్ సప్లయ్ అధికారులు, అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కుకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, ఏఎస్‌వో నిత్యానంద్, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, తదితరులు ఉన్నారు.

### విద్యుత్ శాఖ అధికారులను కలిసిన యూనియన్ నేతలు



కామారెడ్డి టౌన్: నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జిల్లా యూనియన్ నాయకులు మంగళవారం విద్యుత్ శాఖ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ రమేష్‌బాబుతో పాటు డివిజనల్, పట్టణ, రూరల్ అధికారులను కలిసి భగవద్గీతలను అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, కోశాధికారి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

### నాయీబ్రాహ్మణ కార్యవర్గం

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలో గ్రామ నాయీబ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జొన్నల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా జొన్నల రమేష్, ఉపాధ్యక్షుడిగా జొన్నల నాందేవ్, కార్యదర్శిగా బుర్గు శ్రీనివాస్, సలహాదారులుగా జొన్నల లక్ష్మణ్, సిద్దరాములు ఎన్నికయ్యారు.

# హడలెత్తిస్తున్న కోతులు, కుక్కలు

- ప్రజలపై దాడులకు తెగబడుతున్న వైనం
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు
- నియంత్రించాలని పలువురి వినతి



జనగామలో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కోతులు



బీబీపేటలోని ఓ కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

బీబీపేట: అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాళం వేయకుంటే చాలు ఇళ్లలోకి చొరబడి అందినకాడికి వస్తువులను తీసుకుపోవడం చిందరవందరగా చేయడంతో నానా అవస్థలు పడుతున్నారు. దీంతో పాటు గ్రామాల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు మీదపడి దాడి చేస్తాయో అని జనం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులపై పదుల సంఖ్యలో దాడులు చేస్తూ వారిని గాయపరుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు కానీ గ్రామాల పాలకవర్గం సభ్యులు గానీ చప్పుడు లేకుండా ఉంటున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పలువురు ఇప్పటికే వ్యవసాయ భూముల వద్ద పెట్టుకున్నట్లుగా సోలార్ వైర్‌ను ఇంటి చుట్టూ స్తంభాలతో కట్టి కోతుల బాధ నుంచి తప్పించుకుంటున్నారు. దీని కోసం రూ.వేలు ఖర్చు పెట్టి వాటిని రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**పట్టింపు లేదు..**

మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో వీధి కుక్కలు వందల సంఖ్యలో పెరిగి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. చిన్నపిల్లలు వీధుల్లో ఆడుకుంటూ ఎక్కడ వాటి బారిన పడతారోనని పెద్దలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందికరమైన పరిస్థితి. వాహనదారులు ఎవరైనా సరే రాత్రివేళల్లో బయటకు వస్తే వెంటపడుతున్నాయి. పలుసార్లు మోటార్ సైకిళ్లు పల్టీ కొట్టి ఘటనలు కూడా ఉన్నాయి. కుక్కల దాడిలో గాయపడిన వారు వైద్యం కోసం దవాఖానాల చుట్టూ తిరిగి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా వాటి నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేయడమో లేక పట్టుకెళ్లి దూర ప్రాంతాల్లో విడవడమో చేయాలని కోరుతున్నారు.

#### ఇటీవల జరిగిన కుక్కలు, కోతుల దాడులు

గడిచిన రెండు నెలల కాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రయివేటు ఆస్పత్రుల్లో కుక్కలు, కోతులు కరవడం వల్ల చికిత్స చేయించుకున్న వారి సంఖ్య 73. నవంబర్, డిసెంబర్ నెలలో కుక్కలు 13 మందిని కరిచి గాయపర్చడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. అలాగే కోతుల వల్ల నలుగురు గాయపడడంతో చికిత్స చేయించుకున్నారు. ప్రయివేటు ఆస్పత్రిలో చాలా వందల మంది వైద్యం చేయించుకుంటున్నారు.

#### బయటకు రావాలంటేనే భయం



గ్రామంలో విచ్చలవిడిగా కుక్కలు తయారయ్యాయి. వాటి భయానికి బయటకు రావాలంటే భయమేస్తోంది. రాత్రి వేళల్లో మోటార్ సైకిల్‌పై వీధుల్లోకి వస్తే కుక్కలు వెంటపడుతున్నాయి. గ్రామంలో ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. పిల్లలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. అధికారులు, పాలకులు పట్టించుకొని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి. – రంజిత్‌గౌడ్, బీబీపేట

#### కోతులను నియంత్రించాలి



కోతుల వల్ల ఇళ్ల మీద గూన పెంకులు ఉండటం లేదు. ఎన్ని సార్లు గూన పెంకులు పెట్టించినా కానీ కోతుల వల్ల తరుచూ పాడవుతున్నాయి. కోతులను తరిమి కొట్టాలని ప్రయత్నిస్తే మీద దూకి దాడి చేస్తున్నాయి. దీంతో వాటి జోలికి వెళ్లాలంటే భయంగా ఉంటుంది. గ్రామాల్లోనే కాకుండా వ్యవసాయ పొలాల్లో కూడా పెట్టిన పంటలను సైతం పాడు చేస్తున్నాయి. – యాదగిరి, బీబీపేట

# దేశవ్యాప్తంగా డ్రైవర్ల సమ్మె..

- పెట్రోల్ పంపుల వద్ద బారులు తీరిన వాహనదారులు
- ట్యాంకు ఫుల్ చేయించుకుంటున్న వైనం

హిట్ అండ్ రన్ కేసులో పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 లక్షల జరిమానా విధించేలా కేంద్రం చట్టం చేసిన సంగతి తెల్సిందే. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో బంకుల్లో పెట్రోల్, డీజిల్ స్టాకు తగ్గిపోయింది. భవిష్యత్‌లో సమ్మె కొనసాగితే ఇంధన కొరత ఉంటుందేమోనని వార్తలు సోషల్ మీడియాలో వ్యాపించడంతో వాహనదారులు బంకుల బాట పట్టారు. దీంతో బంకుల వద్ద రద్దీ ఏర్పడింది. – సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులో బారులు తీరిన వాహనదారులు



కొయ్యగుట్ట వద్ద పెట్రోల్ బంకులో..



నస్రుల్లాబాద్‌లో..



గోపాల్‌పేటలో..



ఎల్లారెడ్డిలో ..



దోమకొండలో..

### పాఠశాల సందర్శన



వ్యాపారవేత్త వేణుగోపాల్‌రెడ్డితో టీచర్లు

బీబీపేట: మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం జనగామ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఐదేళ్లుగా విద్యార్థులు సాధిస్తున్న ఐఐటీ సీట్లు, వారు పలు పోటీలలో ప్రతిభ కనబర్చడంతో అభినందించారు. భవిష్యత్తులో పాఠశాలను దత్తత తీసుకుంటానని, అవసరమైన అభివృద్ధికి పాటుపడతానని మాట ఇచ్చారని హెచ్ఎం సారయ్య తెలిపారు. దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, గ్రామస్తులున్నారు.

# బడీడు పిల్లల సర్వే



బాయంపల్లిలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీలు



ఇటుకబట్టీల వద్ద బడీడు పిల్లలతో సీఆర్పీ వరలక్ష్మి

లింగంపేట(ఎల్లారెడ్డి): బాయంపల్లి, బాయంపల్లి తండా, లింగంపేట గ్రామాల్లో మంగళవారం సీఆర్పీలు బడీడు పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చిన్నారులను బడిలో చేర్పించారు. ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంజీవ్‌కుమార్, రాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్ జీపీల్లో బడీడు పిల్లలను విద్యాశాఖ సీఆర్పీ వరలక్ష్మి గుర్తించారు. విద్యార్థులకు కావాల్సిన యూనిఫామ్స్, నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలను అందజేస్తామని పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు. ఐఈఆర్‌టీసీ చిన్నసాయులు, ప్రధానోపాధ్యాయులు యశ్వంత్ పాల్గొన్నారు.

### ప్రేరణ ఇంపాక్ట్ శిక్షణ

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఆధ్వర్యంలో శిక్షకులు సింధు రెడ్డి మంగళవారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. పరీక్షలు అంటే విద్యార్థులు భయపడకూడదని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచనలు చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సింధురెడ్డిని సన్మానించారు. హెచ్ఎం గంగాకిషన్, ఉపాధ్యాయులు సాయిలు, సాదిక్, జంగం శ్రీశైలం, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సింధు రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

### కేంద్ర పథకాలపై అవగాహన

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్, ఇబ్రహీంపేట్ తండాల్లో మంగళవారం భారత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా కేంద్రం ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఎన్‌డీసీసీబీ మేనేజర్ రాజు ఖాతాదారులు, వ్యాపారులకు అందిస్తున్న వివిధ రకాల రుణాల గురించి వివరించారు. ఆత్మ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ ప్రియాంక పీఎం కిసాన్, పంటలపై డ్రోన్‌లతో మందుల పిచికారీ గురించి చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అధికారి వెంకట్, ఆరోగ్య మిత్ర పద్మ, తదితరులు పాల్గొన్నారు.



హన్మాజీపేట్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

# ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

సాక్షి నెట్‌వర్క్ : ప్రజాపాలన కార్యక్రమానికి మంగళవారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన వెంటనే ఈ ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సమాధానమిస్తున్నారు. దరఖాస్తులు జనవరి 6 వరకు స్వీకరిస్తామని అధికారులు వెల్లడించారు. ఉన్నతాధికారులు దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల వద్ద పరిశీలించారు.



ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీవో తదితరులు



మేనూర్‌లో.. తహసీల్దార్ ముజీబ్



సజ్జనపల్లిలో .. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి



బాన్సువాడలో..



మాగిలో ..తహసీల్దార్ బిక్షపతి



కోనాపూర్‌లో సీఎం సందేశం చదువుతున్న ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

### ఆలయానికి విరాళాల అందజేత

పిట్లం(జుక్కల్):పోతురెడ్డిపల్లి హనుమాన్ హనుమాన్ ఆలయానికి మంగళవారం భక్తులు విరాళాల అందజేశారు. అన్నారంకు చెందిన పాండురంగారావ్ రూ.5 వేలు, పురోషోత్తం రూ.5 వేలు, బుడ్మికి చెందిన లక్ష్మణ్ రూ. 21 వందలు, మల్లూర్ తండాకు చెందిన బబ్బర్,మోతీరాం రూ.21 వందలను విరాళంగా ఆలయ నిర్వాహకులు తేజకి అందజేశారు.

### హన్‌మాన్ చాలీసా పఠనం

భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీ నగరేశ్వరాలయంలో హన్‌మాన్ చాలీసా పారాయణంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయోధ్యలో శ్రీరాముడి దేవాలయం ప్రారంభం సందర్భంగా శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పిలుపు మేరకు సాయి హన్‌మాన్ సేవా సమితి, శ్రీరామదండు ఆధ్వర్యంలో హన్‌మాన్ చాలిసా నిర్వహించారు.

## సమాచారం..

**రేపటి నుంచి డీఈఎల్‌ఈడీ 'ప్రథమ' పరీక్షలు**

కామారెడ్డి అర్బన్: డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్‌ఈడీ) ప్రథమ సంవత్సరం పరీక్షలు జనవరి 4 నుంచి పదవ తేది వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.రాజు తెలిపారు. పరీక్షలు ప్రకటించిన తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని, హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

**నేడు, రేపు నీటి సరఫరాలో అంతరాయం**

బాన్సువాడ: బాన్సువాడ, జుక్కల్, బోధన్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాలకు బుధ, గురువారాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ డీఈ వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. 145 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రధాన పైపులైనులో లీకేజీలు ఏర్పడడంతో మరమ్మతులు జరుగుతున్నాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

**బాన్సువాడలో అయ్యప్ప ఆరట్టు మహోత్సవం**

బాన్సువాడ : బాన్సువాడ అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప ఆరట్టు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

**సొసైటీ అవిశ్వాస సమావేశం వాయిదా**

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలోని సొసైటీ అవిశ్వాస తీర్మాన సమావేశం నేటికి( బుధవారం) వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాల సహకార సంఘం అధికారి సింహాచలం మంగళవారం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా సమావేశాన్ని నేటికి (బుధవారం) వాయిదా వేసినట్లు తెలిపారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



న్యాయశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి



ఆర్యభట్ట, కౌటిల్య కళాశాలల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వ్యాపారవేత్త టి. సుభాష్ రెడ్డి



టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను .. కలెక్టర్ జితేష్



టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను..డీఈవో ఎస్.రాజు

# కొనసాగుతున్న అక్షింతల శోభాయాత్ర



ఇస్సానగర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



అక్షింతలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ నేతలు

సాక్షి నెట్‌వర్క్ : శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య రాములోరి అక్షింతల శోభాయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. మంగళవారం అక్షింతలతో కూడిన కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరామ్, రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్‌కి అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, పలు హిందూసంఘాల సభ్యులు, అయ్యప్పస్వాములు, బీజేపీ నాయకులు, స్థానిక గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అక్షింతలు ప్రతి ఇంటికి చేరాలి



దోమకొండలో సమావేశమైన కదిరె లక్ష్మారెడ్డి, తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు

దోమకొండ: అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ప్రతి ఇంటికి అందేవిధంగా ప్రణాళిక తయారు చేసినట్లు దోమకొండ శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు మండల సంయోజక్ కదిరె లక్ష్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఈనెల 5న ఉదయం నుంచి వీటిని ఇంటింటికి అందజేస్తామన్నారు. శ్రీరాముడి అక్షింతలు వచ్చే సమయంలో ఇంట్లో ప్రతి కుటుంబం కొన్ని అక్షింతలు కలిసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు కదిరె మోహన్‌రెడ్డి, చింతల రాజేష్, పున్న లక్ష్మణ్, తదితరులున్నారు.